క్లుప్తంగా

ప్రక్కిలంకలో మహా కుంభాభిషేకం

తాళ్లపూడి: ప్రక్కిలంకలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాకుంభాభిషేకం గురువారం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొతవరపు విశ్వనాథశర్మ, శశిశేఖర మిత్ర బృందం ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఉదయం ఆలయం ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేసి, గోదావరి నదికి సామూహికంగా వెళ్లి 108 మట్టి కుండలతో జలాలను తెచ్చి భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో హోమాలను నిర్వహించారు. ఆలయంలో శివునికి లక్షపత్రి పుజను నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చాగల్లులో వై ఏపీ నీడ్స్ జగన్

చాగల్లు: చాగల్లు-1 సచివాలయ పరిధిలోని వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సచివాలయం వద్ద ప్రజలకు అందించిన సంక్షేమ వివరాలతో కూడిన సమాచార బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఎగుర వేశారు. పల్లె నిద్ర చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్య క్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ ఉన్నమట్ల మన శాంతి, ఎంపీటీసీ కో ఆప్షన్ సభ్యులు ఎస్కె పాషా, జాలెం వెంకట్రావు, కార్పొరేషన్ డైరెక్టర్ పి.సింహాద్రి, జేసీఎస్ మండల కన్వీనర్ ఊబా దుర్గారావు పాల్గొన్నారు.

డ్వామా ఏపీడీగా రాంప్రసాద్

చాగల్లు: స్థానిక ఎంపీడీవోగా పని చేస్తున్న బి.రాంప్రసాద్ పదోన్నతిపై రాజమండ్రి క్లస్టర్ డ్వామా ఏపీడీగా బదిలీ అయ్యారు. ఎంపీడీవో కార్యాలయం ఏవోగా పనిచేస్తున్న నిర్మల కుమారి ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతి పొందని బి.రాంప్రసాద్‌ను ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ గారపాటి విజయదుర్గ, జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యాక్షుడు గంగ్రోతు సురేంద్రకుమార్, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, మండల వైఎస్సార్ సీపీ గౌరవధ్యక్షుడు, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావులు అభినందనలు తెలిపారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

తాళ్లపూడి: కొవ్వాడ కాలువ సమస్య పరిష్కరించడానికి కమిటీ వేయాలని, అదేవిధంగా తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర కోరారు. తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేట, గజ్జరం, పోచవరం, తాడిపూడి తదితర గ్రామాల్లోని తుపానుకు దెబ్బతిన్న పంటలను బీజేపీ నాయకులు గురువారం పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. అనంతరం పోచవరం, తాడిపూడి ప్రాంతంలో కొవ్వాడ కాలువను పరిశీలించారు. తుపాను కారణంగా వరి, అరటి, కూరగాయ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఆ రైతులను ఆదుకోవాలని కోరారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి తిరుమలశెట్టి కృష్ణ, నాయకులు గోకవరపు జితేంద్ర రవి, కిల్లాని వెంకట రమణ, ఎలుగు బంటి బాలకృష్ణ, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలో రవికి ప్రథమ స్థానం



కీడాకారుడు రవిని అభినందిస్తున్న అధ్యాపకులు

నిడదవోలు : పెనుగొండలోని ఎస్వీఆర్‌కేపీ, కేఎస్ రాజు కళాశాలలో ఈనెల నాలుగో తేదీన జరిగిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ బాక్సింగ్ పోటీల్లో స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్.రవి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఒ.జ్యోతి తెలిపారు. రవిని గురువారం అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలను అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

తాళ్లపూడి: తుపాను బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకుంటోందని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అన్నారు. ప్రక్కిలంక గ్రామ పంచాయతీలోని ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామాల్లో 28 కుటుంబాలను పునరావాస కేంద్రలకు తరలించారు. ఆయా కుటుంబాలకు గురువారం ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, కొవ్వూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాళ్ల బాబూరావు చేతుల నిత్యావసర వస్తువులు అందజేశారు. 25 కేజీల బియ్యం, కిలో నూనె ప్యాకెట్, కిలో కందిపప్పు చొప్పున, ఉల్లిపాయలు తదితర నిత్యావసర సరుకులు అందజేశారు. పైడిమెట్ట గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొల్లి దుర్గారావు, వీఆర్వో విజయలక్ష్మి, గ్రామ వలంటీర్లు రాధిక, నక్షత, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- గ్రామాల్లో పంటల పరిశీలన



నల్లాకులవారిపాలెంలో తడిసిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు



గోపాలపురం మండలం గోపవరంలో తడిసిన పనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

పెరవలి: మిచాంగ్ తుపాను వలన నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు పేర్కొన్నారు. ముక్కామల, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి గ్రామాల్లో గురువారం తుపాను వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోల్పోయిన రైతులు అధైర్యపడొద్దని, ప్రతి రైతుకు నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. తడిసిన ధాన్యం ఎటువంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేస్తామని, ఆన్‌లైన్ లేకుండా ఆఫ్‌లైన్‌లోనే ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గతంలో వరదల వల్ల నష్టపోయిన అరటి రైతులు పరిహారం అందిస్తామన్నారు. ఈ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఎప్పుడు అందుబాటులో ఉంటుందని అందులో ఎటువంటి సందేహం లేదని రైతు దీమాగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వీరమల్ల సత్యనారాయణ, సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీలు నక్కా పాలేశ్వరరావు, బొకే వెంకటేశ్వర్లు, వేండ్ర శ్రీను, వ్యవసాయాధికారి మేరీ కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే తలారి

గోపాలపురం: తుపాను ప్రభావంతో దెబ్బతిన్న ప్రతి రైతును ఆదుకుంటామని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న వరి, పొగాకు ఇతర పంటలను గురువారం ఆయన పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. మండలంలో సుమారు 800 హెక్టర్లలో వరి, 600 హెక్టార్లలో పొగాకు, 8 హెక్టార్లలో వేరుశనగ, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది ముంపుకు గురికావడానికి కారణమైన కొవ్వాడ కాలువ వెడల్పు చేయడానికి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. యుద్ధ ప్రాతిపదికన పంట నష్టం నివేదికను ప్రభుత్వానికి పంపి పరిహారం చెల్లిస్తామని ఎమ్మెల్యే రైతులకు సూచించారు. ఈయన వెంట ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, చిట్యాల, గోపాలపురం, గోపవరంగ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..



బాధితులకు నష్టపరిహార నగదు చెక్కులు, నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు : మిచాంగ్ తుపాను ప్రభావంతో గృహాలు ధ్వంసమైన యజమానులను నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలో తన కార్యాలయంలో గురువారం తుపానుతో ధ్వంసమైన ఇంటి యజమానులకు తాత్కాలిక నష్ట పరిహారాన్ని ఆయన అందించారు. నిడదవోలు పట్టణంతో పాటు నిడదవోలు మండలంలో కోరుమామిడి, కలవచర్ల, తిమ్మరాజుపాలెం, ఉనకరమిల్లి, పెండ్యాల గ్రామాల్లో గృహాలు ధ్వంసమైన ఎనిమిది మంది బాధితులకు తక్షణ సాయంగా రూ.1.48 లక్షల నగదు చెక్కులతో పాటు 25 కేజీల రైస్, కేజీ కందిపప్పు, కేజీ నూనే, కూరగాయలు ఆయన పంపిణీ చేశారు. తుపాను ప్రభావంతో ఎటువంటి నష్టం జరిగినా ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుంటుందన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తాం



డి.ముప్పవరంలో రైతులతో మాట్లాతున్న తహసీల్దార్ గంగరాజు

నిడదవోలు రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలకు నీట ముంపునకు గురై తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుందని తహసీల్దార్ గంగరాజు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం, డి.ముప్పవరం, కోరుమామిడి గ్రామాల్లో నీటమునిగిన వరిపొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. నిడదవోలు మండలంలో 250 ఎకరాల్లో వరి, 356 ఎకరాల్లో అరటి, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని, ఆఫ్‌లైన్‌లో వెంటనే ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని రైతులకు సూచించారు. ఏవో జి.సత్యనారాయణ, సివిల్ సప్లై డీటీ ఎం.అనిల్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పంట నష్టం వివరాల సేకరణ

తాళ్లపూడి: తుపాను దాటికి దెబ్బ తిన్న పంటల నష్టం వివరాలను సేకరిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి జి.రుచిత తెలిపారు. మండలంలో వరి 520 హెక్టార్లలో, మినుము 86 హెక్టార్లలో, మొక్కజొన్న 108 హెక్టార్లలో, పొగాకు 85 హెక్టార్లలో నీట మునిగి దెబ్బతిందన్నారు. ప్రాథమిక అంచనా వేశామని, ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

తడిసిన పంటను సంరక్షించుకోవాలి

- ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు నందకిశోర్, అచ్యుతారాజు
- గ్రామాల్లో పంట పొలాల పరిశీలన



తెలికిచెర్లలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి, తూర్పుచోడవరం, తెలికిచెర్ల గ్రామాలలో ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టరు నందకిశోర్, డాక్టరు అచ్యుతారావు గురువారం పర్యటించారు. నీట మునిగిన వరి, మినుము, మొక్కజొన్న తదితర పంటలను వారు పరిశీలించారు. తెలిచెర్లలో వరి చేలోకి వెళ్లి తడిసిన ధాన్యాన్ని ఎలా సంరక్షించుకోవాలో రైతులకు వివరించారు. తడిసిన పనలపై 5 శాతం ఉప్పుద్రావణం పిచికారీ చేయాలన్నారు. ఈ ప్రక్రియ వల్ల మొలక శాతం తగ్గించడమే కాకుండా ధాన్యం రంగుమారకుండా ఉంటుందన్నారు. రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. పంట నేలనంటిన మెరక పొలాల్లో పంటను నాలుగైదు కుదుళ్లను కలిపికట్టి నిలబెట్టే ప్రయత్నం చేయాలన్నారు. ఖళ్లాల్లో ఉన్న ధాన్యం రాసులలో కింద మొలక రాకుండా ఒక క్వింటాలు ధాన్యానికి 5 కిలోల ఉప్పునీరు వేస్తే రంగుమారకుండా, మొలకశాతం రాకుండా ఉంటుందన్నారు.

మొక్కజొన్నకు ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేసి పంటను రక్షించుకోవచ్చునన్నారు. మినుము, పొగాకు పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్, వ్యవసాయ సహాయకులు హేమంత్, సురేష్ ఉన్నారు.

పంటల పరిశీలన

నల్లజర్ల: మండలంలోని తెలికిచెర్ల, పోతవరం, శింగరాజుపాలెం, అనుమునిలంక తదితర గ్రామాల్లో ఉద్యాన పంటలకు తీవ్రనష్టం జరిగినట్టు ఆ శాఖ అధికారి బబిత తెలిపారు. గురువారం ఆమె ఉద్యాన వన పంటను పరిశీలించారు. అరటి 85ఎకరాలు, కూరగాయల సాగు 75 ఎకరాలు, రెండున్నర ఎకరాలలో పువ్వుల సాగు, 5 ఎకరాలలో బొప్పాయి దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనా వేసినట్టు ఆమె తెలిపారు. అరటి తోటల్లో నిలిచిన నీటి నంతటిని కాలువలు తీసి బయటకు పంపించాలని, 100 గ్రాముల యూరియా, 80 గ్రాములు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మొక్కకు రెండు దఫాలుగా 20, 25 రోజుల వ్యవధిలో వేయాలన్నారు. ఆకులు, గెలలపై 13-0-45 మందును లీటరు నీటికి 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. 75 శాతం తయారైన గెలలకు ఆకులు చుట్టి 15 రోజుల్లో మార్కెట్‌కు తరలించాలన్నారు. అరటి దుంపలు కుళ్లిపోకుండా కాపర్ ఆక్సీక్లోరైడు 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొదలు తడిసేటట్టు పిచికారీ చేయాలన్నారు. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రోపికోనజోల్ ఒక మిల్లీ లీటరు మందును లీటరు నీటికి కలిపి ఆకులు తడిసేలా పిచికారీ చేయాలన్నారు. కూరగాయలు, పువ్వుల సాగు, దొండ పందిళ్లలో 13-0-45 మందును లీటరు నీటికి 3 గ్రాముల మందు, యూరియా 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. బొప్పాయిలో వేరు, కాండం కుళ్లు రాకుండా మెటాలాక్సిల్ 2 గ్రాములు లేదా కార్బెక్సిన్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి వేరు భాగం తడిసేలా పిచికారీ చేయాలన్నారు. ఉద్యాన పంటలు 33 శాతం కంటే ఎక్కువ నష్టపోయితే పరిహారం అందిస్తమాన్నారు.



పోతవరంలో అరటి తోటలను పరిశీలిస్తున్న ఉద్యాశాఖాధికారి బబిత

ఈఓపీఆర్డీకి అభివృద్ధి పనుల ఆమోదం బాధ్యతలు



అట్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం

నిడదవోలు రూరల్: అట్లపాడులో ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు ఆమోదించడంలో గ్రామ సర్పంచ్ దాయం రత్నకుమారి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అధికారులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల ప్రకారం అభివృద్ధి పనుల తీర్మానాలను ఆమోదించేందుకు నిడదవోలు పంచాయతీ విస్తరణాధికారి(ఈఓపీఆర్డీ)కి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పంచాయతీ అధికారి జి.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. అట్లపాడు గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు జెడ్పీ నిధులు రూ.36 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.13 లక్షలు, ఉపాధిహామీ పథకం నిధులు రూ.7లక్షలు మంజూరు కాగా గత మూడు నెలలుగా పంచాయతీ గ్రామ సర్పంచ్ రత్నకుమారి పాలకవర్గ సమావేశాల్లో అజెండాలో పెట్టిన ఆ పనుల తీర్మానాలను ఆమోదించలేదు. దీంతో వార్డు సభ్యులు బీరా చిన్నా, తానుకొండ నాగమణి, పుచ్చకాయల పద్మ, మరపట్ల పద్మ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయగా కొవ్వూరు డీఎల్పీఓ విచారణ చేపట్టి ఉన్నతాధికారులు నివేదించారు. అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా తక్షణమే పనుల తీర్మానాలు ఆమోదించేందుకు ఈఓపీఆర్డీ నియమిస్తూ డీపీఓ ఆదేశాలు జారీ చేశారు.

కులగణన సక్రమంగా చేయండి

ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పెరవలి: దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కుల గణన నిర్వహిస్తున్నారని, అధికారులు ప్రతి ఒక్కరి కులం గురించి జాగ్రత్తగా నమోదు చేయాలని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ పేర్కొన్నారు. పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రజా ప్రతినిధులతో అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కులం నమోదు చేయాలన్నారు. ఎంపిడిఓ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన కుల గణనలో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కులం నమోదు చేయవలసి ఉందన్నారు. ఈ పత్రాల్లో ఏ కులం, ఎంత మంది కుటుంబంలో ఉన్నారు, ఆ కులాన్ని ఏ పత్రంలో నమోదు చేయాలని అనే విషయాలు ఉంటాయన్నారు. వీటిని నిశతంగా పరిశీలించిన అనంతరం నమోదు చేపట్టాలన్నారు. ఈ కుల గణనలో ఏ అధికారి అయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ, ఈఓపిఆర్‌డి, ఎంఈఓ, ఉపాధ్యాయులు, రెవెన్యూ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ఉమా విశ్వేశ్వరునికి ప్రత్యేక పూజలు



స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

పెరవలి: అన్నవరప్పాడులో జాతీయ రహదారి పక్కన ఉన్న ఉమా విశ్వేశ్వస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవతంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము రెండు గంటల నుంచి పూజలు ప్రారంభించారు. 216 మంది దంపతులచే రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం కోటిపల్లి వారి వంశస్తులతో అన్నదానం చేశారు. 6వేల మంది పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం లక్ష పత్రి పూజ నిర్వహించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చాగల్లు విద్యార్థులు



చాగల్లులో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

చాగల్లు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వీర్రాజు గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఇటీవల ఏలూరు పోలీస్ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ హ్యాండ్ బాల్ ఎంపిక పోటీల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ పోటీల్లో జి. జాహ్నవి, ఆర్. నవ్య, కే జ్ఞానేశ్వరి, ఎస్. బేగం, టి.ప్రసన్న, వి.అభిరామ్ ఎంపికయ్యారు. విద్యార్థులు, పీడీ జె.విజయలక్ష్మిలను ఎంఈఓ వి.ఖాదర్ బాబు, హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు. త్వరలో తెనాలిలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా లక్షపత్రి పూజ

దేవరపల్లి: గ్రామంలోని ఉమారామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం కాపు సంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి వివిధ దళాలతో లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ఏటా కార్తీకమాసంలో లక్షపత్రిపూజ చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

కొవ్వూరు ఏఎంసీ ఛైర్మన్‌గా విజయలక్ష్మి

- తొలిసారి కొవ్వూరులో మహిళకి అవకాశం
- వైస్ ఛైర్మన్‌గా కొలిశెట్టి నాగేశ్వరరావు



ఉప్పులూరి విజయలక్ష్మి



కొలిశెట్టి నాగేశ్వరరావు

కొవ్వూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా తొగుమ్మి గ్రామ సర్పంచ్ ఉప్పులూరి విజయలక్ష్మిని నియమిస్తూ మార్కెటింగ్ శాఖ నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మార్కెట్ కమిటీ ఏర్పడిన తర్వత తొలిసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళకు అవకాశం కల్పించారు. ఏఎంసీ ఛైర్మన్ల నియమాకంలోను ప్రభుత్వం రిజర్వేషన్లను అమలు చేయడంతో ఇక్కడ మహిళకి చాన్స్ లభించింది. 1997 సెప్టెంబర్ 18న ఏర్పడిన ఈ కమిటీకి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం మహిళలకు అవకాశం కల్పించలేదు. విజయలక్ష్మి తొగుమ్మికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఉప్పులూరి సూరిబాబు సతీమణి. ఏఎంసీకి గౌరవ అధ్యక్షురాలిగా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత వ్యవహరిస్తారు. వైస్ ఛైర్మన్‌గా తాళ్లపూడి మండలం రావూరుపాడు గ్రామానికి చెందిన కొలిశెట్టి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈయన గతంలో ఎంపీటీసీ సభ్యుడిగాను, పెద్దేవం ఉపసర్పంచ్ గాను, వార్డు మెంబర్‌గాను పనిచేశారు. ప్రస్తుతం గ్రామ సచివాలయ కన్వీనర్‌గా పని చేస్తున్నారు. డైరెక్టర్లగా సుంకర శ్రీరామ చంద్రరం గారావు, కొటికలపూడి మేరీ పుష్ప, అయినం నాగరాజు, కొత్తపల్లి సునీత, వీర మళ్ల కనకదుర్గ, వేంద్ర సూరిబాబు, షేక్ యూసఫ్ షరీఫ్, ఎల్లే నాగేశ్వరరావు, బొల్లిపో రత్న కుమారి, గోపిరెడ్డి ప్రసాద్, కంటిపాటి వీర వెంకట సత్యనారాయణమూర్తి, ప్రగళ్లపాటి పాటేశ్వరి, అన్నదేవర శ్రీరాజరాజేశ్వరీ, గనిశెట్టి వీర వెంకట రమణమూర్తి, ఎం.సునీల్ వినయ్, చంద్రశేఖర్ , బావన రత్నకుమారి డైరెక్టర్‌గా నియమిలయ్యారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం



వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కృపా పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు

కొవ్వూరు: క్రీస్తు బోధనలు ఆచరణీయమని మునిసిపల్ ఛైర్ పర్సన్ బావన రత్నకుమారి సూచించారు. పట్టణంలో టౌన్ లూథరన్ చర్చిలో గురువారం రాత్రి నిర్వహించిన కృపా పాస్టర్స్ అసోసియేషన్ ఐక్య క్రిస్మస్ వేడుకలకు ఛైర్ పర్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కృపా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫిలిప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కార్యదర్శి పి.ఆనందరాజు అధ్యక్షత వహించారు. డాక్టర్ ప్రశాంత్‌కుమార్ హాలోనెన్ ప్రసంగించారు. ఏసు క్రీస్తు బోధనలు, కీర్తనాలు అలపించారు. డీజే పురుషోత్తం, పి.బెన్ని ప్రేమ్‌కుమార్, వేము వెంకటరత్నం, కొయ్యే ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. అంతటా నష్టం

- డివిజన్‌లో 693.58 హెక్టార్లలో ఉద్యాన పంటలకు దెబ్బ
- వ్యవసాయ శాఖలో 1607.67 హెక్టార్లకు నష్టం
- డివిజన్‌లో 1554 హెక్టార్లలో ఒరిగిన వరి
- రూ.22.18లక్షలు విద్యుత్ శాఖకు నష్టం



తాళ్లపూడి మండలంలో విద్యుత్‌లైన్ పనులు చేస్తున్న సిబ్బంది



కాపవరం వద్ద హైవేపై ఆరబెట్టిన ధాన్యాన్ని తరలించేందుకు సంచుల్లోకి ఎత్తుతున్న రైతులు

కొవ్వూరు: మిచాంగ్ తుపాను బీభత్సం సృష్టించింది. రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. అయితే అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడం ముందస్తు చర్యలు తీసుకోవడంతో నష్ట తీవ్రత తగ్గింది. మండలస్థాయి అధికారులు కమిటీలుగా ఏర్పడి కళ్లల్లో ఉన్న ధాన్యాన్ని తరలించడంతో చాలా వరకు నష్టం తగ్గింది.

తుపానుకు కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతంలో పంటలకు తీవ్ర నష్టం చేకూరింది. ప్రధానంగా వరి, అరటి, కూరగాయల రైతులకు అపార నష్టం వాటిల్లింది. కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో 693.58 హెక్టార్లలలో అరటి, మిర్చి, కూరగాయలు, పూలు, బొప్పాయి తదితర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వ్యవసాయ శాఖ పరిధిలో 3,161.67 హెక్టార్లలో వరి, మినుము, వేరుశెనగ, పత్తి పంటలకు పాక్షిక నష్టం కలిగినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. డివిజన్ పరిధిలో అత్యధికంగా పెరవలి, కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి, నిడదవోలు మండలాల్లో 120 గ్రామాల పరిధిలో అధికంగా ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. దేవరపల్లి, కొవ్వూరు, ఉండ్రాజవరం, గోపాలపురం, తాళ్లపూడి, పెరవలి మండలాల్లో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో 114 గ్రామాల్లో 1,132.47 హెక్టార్లలో వరి పంట ముంపు బారిన పడినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. మరో 1,554 హెక్టార్లలో వరి పంట ఈదురుగాలుల ప్రభావానికి నేలకు ఒరిగినట్టు గుర్తించారు. నల్లజర్ల, చాగల్లు, దేవరపల్లి, ఉండ్రాజవరం మండలాల్లో వేరుశెనగ 148.6 హెక్టార్లలలోను, గోపాలపురం మండలంలో 6.2 హెక్టార్లలో పత్తి, చాగల్లు, దేవరపల్లి, గోపాలపురం, కొవ్వూరు, నల్లజర్ల, నిడదవోలు, తాళ్లపూడి మండలాల్లో మినుము పంట 320.4 హెక్టార్లలో నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.

విద్యుత్ శాఖకు రూ.22.18 లక్షల నష్టం

డివిజన్ పరిధిలో ఈదురుగాలులు, భారీ వర్షం ప్రభావంతో విద్యుత్ శాఖకి తీవ్ర నష్టం వాటిల్లింది. ట్రాన్స్‌ఫార్మర్లు 18 చోట్ల దెబ్బతిన్నాయి. చెట్లు కూలి విద్యుత్‌లైన్‌పై పడడంతో సుమారు ఐదుకిలో మీటర్లు పొడవైన విద్యుత్ తీగలు పాడయ్యాయి. చెట్లు కూలడంతో 98 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. నల్లజర్లలో 130 కేవీ సబ్ స్టేషన్‌లో నీళ్లు రావడంతో దెబ్బతింది. కొవ్వూరులోను 130 కేవీ సబ్‌స్టేషన్‌లో సమస్య ఏర్పడింది. ఈదురుగాలుల ప్రభావంతో తీగలు తెగిపోవడం, స్తంభాలు కూలిపోవడంతో సరఫరాకి తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు గత రెండు రోజుల నుంచి యుద్ధప్రతిపాదికన పనులు చేసి సరఫరా పునరుద్ధరించారు.

ముగిసిన వేంకటేశ్వరుని పవిత్రోత్సవాలు



అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ పూజలను యర్రంశెట్టి బ్రహ్మాజీరావు కుటుంబం నిర్వహించింది. వేద పండితులు శ్రీమాన్ ఖండవల్లి రాజేశ్వరరావు, వర ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. చివరి రోజు పూర్ణాహుతి నిర్వహించారు. పవిత్రోత్సవాలకు కడింపాడు, పిట్టల వేమవరం, దొంగరావిపాలెం, ఖండవలి తదితర గ్రామాల నుంచి భక్తులు వచ్చి తిలకించారు. అనంతరం దాత యర్రంశెట్టి బ్రహ్మాజీరావు దంపతులను దేవస్థానం ఈఓ మీసాల రాధాకృష్ణ, ఆలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.